క్లుప్తంగా

అందరి సహకారంతోనే మండలాభివృద్ధి



ఎంపీడీవో ఉషారాణిని సత్కరిస్తున్న ఎంపీటీసీ సభ్యులు

మునగపాక: మునగపాక మండల అభివృద్ధికి పాటు పడాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. మండల పరిషత్ హాలులో శుక్రవారం ఎంపీటీసీ సభ్యులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ ద్వారా అభివృద్ధి పనులకు కొత్తగా ప్రతిపాదనలు అందించాలన్నారు. ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని, తద్వారా అభివృద్ధి పనులు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మద్దాల వీరునాయుడు, సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, మొల్లేటి కృష్ణవేణి, ఇల్లా శిరీష, శరగడం అప్పలనరసమ్మ, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో ఉషారాణిని ఎంపీటీసీ సభ్యులు సత్కరించారు.

శ్రమదానంతో తుప్పల తొలగింపు



మూలపేట నుంచి అనకాపల్లికి వెళ్లే దారిలో తుప్పల తొలగింపులో పాల్గొన్న రైతులు

మునగపాక: మండలంలోని మూలపేట నుంచి అనకాపల్లికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పల తొలగింపు పనులను మాజీ సర్పంచ్ బొడ్డేడ చెల్లయ్యనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సమస్య పరిష్కారానికి చెల్లయ్యనాయుడు ముందుకొచ్చారు. రైతుల సహకారంతో తుప్పలను తొలగించా రు. రైతులు బొడ్డేడ నాగరాజు, ఆళ్ల కిషోర్, ఆళ్ల సంజీవరావు, బొడ్డేడ గోవిందరావు, వెంకటప్పారావు, భాస్కర్ తదితరులు శ్రమదానం చేశారు.

పంట కోత ప్రయోగాలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఏఎస్‌వో చంద్రమౌళి

మునగపాక: పంట కోత ప్రయోగాలపై దృష్టి సారించాలని ఏఎస్‌వో చంద్రమౌళి కోరారు. మునగపాక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం వీఏఏలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనా పథకంలో భాగంగా వరికి సంబంధించి పంట కోత ప్రయోగాలు చేయాల్సి ఉందన్నారు. మండల వ్యాప్తంగా 32 చోట్ల ప్రయోగాలు చేయాలని నిర్ణయించారు. వీఏఏలు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి, వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పిడుగు పడి విద్యుత్ పరికరాలు ధ్వంసం



కాలిపోయిన విద్యుత్‌మీటరు

నక్కపల్లి: డీఎల్ పురంలో శుక్రవా రం పిడుగు పడి ఓ ఇంట్లో విద్యుత్ పరికరాలు ధ్వంసమయ్యాయి. గ్రామంలో వర్షం పడింది. ఇదే సమయంలో కొక్కిర్ల పాటి నాగరాజు ఇంటిపై పిడుగు పడడంతో శ్లాబ్ గోడ పాక్షికంగా దెబ్బ తింది. ఇంటికి అమర్చిన విద్యుత్ మీటరు షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో ఆరు సీలింగ్ ఫ్యాన్‌లు, బోరుకు అమర్చిన మోటారు, 12 ట్యూబులైట్లు, స్టెబిలైజర్ దగ్ధమయ్యాయి. ఆస్తి నష్టం సుమారు లక్ష రూపాయలు ఉంటుందని బాధితులు తెలిపారు.

పట్టుబడ్డ ఇసుకకు వేలం నేడు

కోటవురట్ల: ఇప్పటి వరకు పట్టుబడిన ఇసుకకు వేలం నిర్వహించనున్నట్టు ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు సందర్భాలలో జరిపిన దాడుల్లో పట్టుబడిన ఇసుకకు శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక పోలీసు స్టేషన్ వద్ద వేలం వేయనున్నట్టు పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు

అడ్డా!



పాత సీహెచ్‌సీ భవనంలో వెయిటింగ్ బెంచీలపై ఖాళీ మద్యం సీసాలు



ఆస్పత్రి భవనం ప్రధాన ద్వారం వద్ద తెరిచి ఉన్న

- పాత సీహెచ్‌సీ భవనం పర్యవేక్షణ గాలికి
- నిత్యం తెరిచే ఉంటున్న గేట్లు

యలమంచిలి రూరల్: కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. అధికారుల నిర్లక్ష్యంతో మందుబాబులకు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న పాత కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆరు నెలల క్రితం తులసీనగర్‌లో నిర్మించిన కొత్త భవనంలోకి మార్చారు. దీంతో పాత సీహెచ్‌సీ భవనం ఖాళీగా ఉండిపోయింది. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద మొదటి అంతస్తులో ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో వైద్యశాలలు నిర్వహిస్తున్నారు. ఇటీవల సహకార శాఖ డివిజినల్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం ఈ భవనంలో కొంత భాగాన్ని కేటాయించారు. మిగిలిన భవనం మొత్తం ఖాళీగా ఉంది. భవనంలోకి ఎవరైనా సులువుగా వెళ్లడానికి వీలుగా పలువైపుల నుంచి ద్వారాలు ఉండటంతో మందుబాబులు, గంజాయి బ్యాచ్‌లు, కొందరు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. ఆస్పతిలో ఎక్కడ చూసినా ఖాళీ మద్యం, బీర్ బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు, సిగరెట్ ముక్కలు కనిపిస్తున్నాయి. నెల రోజుల క్రితం ఎమ్మెల్యే విజయ్‌కుమార్ యలమంచిలి సీహెచ్‌సీ కొత్త, పాత భవనాలను పరిశీలించారు. ఆ సమయంలో పాత ఆస్పత్రి భవనంపై నిర్లక్ష్యం చూప



ఆస్పత్రి భవనానికి రెండో వైపు తెరిచి ఉన్న గేటు

వద్దని వైద్యులకు సూచించారు. నిఘా పెట్టాలని అప్పటి పట్టణ ఎస్ఐ పాపినాయుడుకు ఎమ్మెల్యే చెప్పారు. అయినా యథావిధిగా పాత ఆస్పత్రి భవనంలో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. రాత్రి వేళ మద్యం సేవిస్తూ కొందరూ గట్టిగా అరుస్తూ రోడ్డుపై వెళ్లే మహిళలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. మరో వైపు నిర్వహణ గాలికి వదిలేయడంతో ఆస్పత్రి భవనం అధ్వానంగా తయారైంది. అధికారులు స్పందించి ఈ పాత ఆస్పత్రి భవనాన్ని అద్దె భవనాల్లో నడుస్తున్న ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు కేటాయిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

భవనం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి



యలమంచిలి ప్రధాన రహదారి పక్కనున్న పాత ప్రభుత్వాస్పత్రి భవనం పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. రెండు వైపులా గేట్లను ఏర్పాటు చేసి రాత్రి సమయాల్లో తాళం వేయాలి. పట్టణంలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ఆ కార్యాలయాల నిర్వహణకు ఈ భవనాన్ని ఉపయోగిస్తే మంచిది.

– చింతకాయల శివాజీ. సీఐటీయూ కార్యదర్శి, యలమంచిలి

నిత్యం గేట్లు తీసే ఉంటున్నాయి..



పాత ప్రభుత్వాస్పత్రి భవనం గేట్లు నిత్యం తీసే ఉంటున్నాయి. విలువైన ప్రభుత్వ భవనంపై నిర్లక్ష్యం తగదు. గేట్లు తెరిచి ఉండడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. భవనాన్ని ఇలాగే వదిలేస్తే మరింత అధ్వాన పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంది. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ భవనాన్ని సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్.నవీన్, యలమంచిలి

కలెక్టర్,ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం

యలమంచిలి సామాజిక వైద్యశాల పాత భవనం పరిస్థితి గురించి జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. ఆ భవనాన్ని ఇప్పటికిప్పుడే పరిరక్షించడానికి అవసరమైన సిబ్బంది లేరు. దానికి రిపేర్లు చేయించడమా? ఆ భవనం స్థానంలో పూర్తిగా కొత్తది కట్టడమా? అనే విషయాన్ని కలెక్టర్ నిర్ణయించాల్సి ఉంది. మరోసారి అక్కడి పరిస్థితిని సమీక్షించి వీలైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, డీసీహెచ్ఎస్, అనకాపల్లి

మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు భూసేకరణ

- ఆర్డీవో షేక్ ఆయిషా పట్టణంలో పలు ప్రాంతాల పరిశీలన



భూసేకరణ కోసం అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో షేక్ ఆయిషా

యలమంచిలి రూరల్: పట్టణంలో మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు వేగవంతం చేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2022లో పట్టణంలో 12 మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ఆ మేరకు అధికారులు అప్పట్లోనే ఏయే ప్రాంతాల్లో వీటిని నిర్మించాలో సర్వే చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పల్లపు ప్రాంతాలను ఈ కేంద్రాల కోసం ఎంపిక చేశారు. ఈ ప్రాంతాలన్నింటిని అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషా శుక్రవారం పరిశీలించారు. 4 కేంద్రాలను ప్రభుత్వ స్థలాల్లో, మిగతా 8 కేంద్రాలను ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేయడానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందో రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. పెంజెరువు వద్ద ఎస్టీపీ, మిగతా 11 చోట్ల ఎస్ఎస్‌టీపీలను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించినట్టు అధికారులు ఆమెకు తెలిపారు. పెంజెరువు, ఎర్రవరం, పెదపల్లి ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలకు ప్రతిపాదించిన స్థలాలను ఆమె పరిశీలించారు. అనంతరం టిడ్కో గృహ సముదాయం వద్ద ఏర్పాటు చేసిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఆర్డీవో తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరహాలు, డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

సర్వేలో సమస్యలుంటే దరఖాస్తు చేయండి




సీహెచ్‌బీ అగ్రహారంలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీటీ అన్నాజీరావు

నక్కపల్లి: గతేడాది సమగ్ర భూరక్ష పథకం కింద నిర్వహించిన సర్వేలో ఏమైనా సమస్యలుంటే గ్రామ సభల్లో దరఖాస్తులు అందజేయాలని డిప్యూటీ తహసీల్దార్ అన్నాజీరావు కోరారు. శుక్రవారం ఆయన సీహెచ్‌బీ అగ్రహారంలో రీసర్వే సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. సర్వేలో గుర్తించిన పొరపాట్లు, రైతులకు తలెత్తిన ఇబ్బందులను తమకు తెలియజేయాలన్నారు. సర్వే అనంతరం జారీ చేసిన పాసు పుస్తకాల్లో విస్తీర్ణంలో తేడాలు, సర్వ నంబర్లు తప్పుగా నమోదు కావడం వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సర్వే పూర్తయిన అన్ని గ్రామాల్లో ఈ సభలు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు.

రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక: రెవెన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని అరబుపాలెంలో శుక్రవారం రీ-సర్వేకు సంబంధించి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ-సర్వేలో జరిగిన లోపాలను సవరించేందుకు ఇటువంటి సభలు దోహదపడతాయన్నారు. తహసీల్దార్ ఆది మహేశ్వరరావు మాట్లాడుతూ రీ-సర్వేలో సవరణలు, తేడాలను సరిచేసేందుకు ఈ సభలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. అనంతరం రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఎంపీటీసీ సభ్యురాలు బొడ్డేడ హైమావతి, ఆర్ఐ కిషోర్, రీ-సర్వే డీటీ పడాల్, రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రైతులకు దీపావళి కానుకగా డివిడెండ్ల పంపిణీ



వేణుగోపాలరావు, సీఈవో

మునగపాక: రైతులకు దీపావళి కానుకగా 15 శాతం మేర డివిడెండ్ అందజేస్తామని మునగపాక పీఏసీఎస్ సీఈవో ఆడారి వేణుగోపాలరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంఘం పరిధిలో 6019 మంది రైతులు ఉన్నారన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.4,82,755 మేర డివిడెండ్ అందజేస్తామన్నారు. డిపాజిట్ల సేకరణ ద్వారా రూ.33,79,03,872 లావాదేవీలు, సంఘం ద్వారా రూ.19,59,32,380 మేర రుణాలు అందజేశామన్నారు. సొసైటీకి నికర లాభం రూ.24,83,65,966 వచ్చిందన్నారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రైతులు కూడా సంఘం అభివృద్ధికి సహకరించాలన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని ధర్నా



అచ్యుతాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

అచ్యుతాపురం(మునగపాక): విద్యుత్ చార్జీలు పెంపునకు చేపట్టే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం అచ్యుతాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కన్వీనర్ రాము, సీనియర్ నాయకుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ విద్యుత్ నియంత్రణ మండలి రూ.8,114 కోట్లు ఇంధన సర్దుబాటు పేరుతో చార్జీలు వసూలు చేసేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. వినియోగదారులపై భారం వేయడం కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేయడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరకుల ధరలు చుక్కలు చూపిస్తున్నాయని విమర్శించారు. ఇప్పుడు కరెంటు చార్జీలు పెంచేందుకు పూనుకోవడం సరికాదన్నారు. సీపీఎం నాయకులు కె.రామ సదాశివరావు, ఎస్.కన్నంనాయుడు, బుద్ద రంగారావు, ఆర్.లక్ష్మి, రావి దేవుళ్లు, రమణ పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిలుపుదల మహోత్సవం



నాగులాపల్లిలో గౌరీ పరమేశ్వరులను నిలుపుదల చేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో శుక్రవారం గౌరీ పరమేశ్వరుల నిలుపుదల మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వబ్రాహ్మణులు తయారు చేసిన గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని మేళతాళాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం రావిచెట్టు సమీపంలోని ఆలయంలో గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని నిలుపుదల చేశారు. అధిక సంఖ్యలో భక్తులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, పొలమరశెట్టి నాగు, నూకాలయ్య రెడ్డి ఈశ్వరరావు, కాండ్రేగుల మోదినాయుడు, మళ్ల తేజ, అప్పలనాయుడు, పాము శ్రీను, మళ్ల మోహన్, బొడ్డేడ మహాలక్ష్మి నాయుడు, కర్రి గోవింద, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా మునగపాక అభివృద్ధి



మాట్లాడుతున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: మునగపాక గ్రామాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. మునగపాకలోని సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సదుపాయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. రహదారులు, డ్రెన్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాభివృద్ధిలో రాజకీయాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో సురేష్, కూటమి నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'పల్లె పండగ'

నక్కపల్లి: మండలంలో శుక్రవారం పలు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. నక్కపల్లి, ఉపమాక, అయ్యన్నపాలెం తదితర గ్రామల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, ఎంపీడీవో సీతారామరాజు శంకుస్థాపన చేశారు.

పాయకరావుపేట: శ్రీరాంపురం గ్రామంలో రూ.13 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం, పాల్తేరు గ్రామంలో రూ.20 లక్షలతో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(మునగపాక): పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా కాజీపాలెం, జగ్గన్నపేటు, తిమ్మరాజుపేట, హరిపాలెం, ఎర్రవరం, ఉప్పవరం, ఎం.జగన్నాథపురం తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల పనులకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ భూమి పూజ చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు.

ఇసుక రీచ్‌కు స్థల పరిశీలన



ఇసుక రీచ్‌కు అనువైన స్థలం పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎంపీడీవో

రాంబిల్లి(యలమంచిలి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు రాంబిల్లి మండలంలో శారదానదిలో ఇసుక రీచ్ తవ్వకాల కోసం శారదానది పరివాహక ప్రాంతాల్లో రాంబిల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధురి శుక్రవారం పర్యటించారు. మూలజంప గ్రామంలో శారదానది ఒడ్డున ఎక్కడక్కడ అనువైన ప్రదేశాలలో ఇసుక లభ్యమవుతుందని ఆరా తీశారు. నదిలో నీటి మట్టం అధికంగా ఉండడంతో ఇసుక తవ్వకాలు జరిపేందుకు వీలు కాకపోవడంతో గనుల శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపించామని వారు తెలిపారు.

పరిహారం ఇచ్చాకే పరిశ్రమలకు అనుమతి

- అధికారులకు స్పష్టం చేసిన రైతులు
- ఏపీఐఐసీ ఆధ్వర్యంలో గ్రామ సభలు



చందనాడ గ్రామసభలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నర్సింహమూర్తి

నక్కపల్లి: తమ నుంచి సేకరించిన భూములకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించిన తర్వాతే పరిశ్రమలు పెట్టుకోవాలని రైతులు స్పష్టం చేశారు. శుక్రవారం చందనాడ, డీఎల్ పురం తదితర గ్రామాల్లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నర్సింహమూర్తి మాట్లాడుతూ విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ భూములు సేకరించిందన్నారు. ఈ భూములకు నష్ట పరిహారం పూర్తిగా చెల్లించామని, అక్కడక్కడ పెండింగ్ ఉందన్నారు. పరిహారం చెల్లించాలని ఇటీవల కలెక్టర్ నిర్వహించిన గ్రీవెన్స్‌లో రైతులు అర్జీలు పెట్టుకున్నారని, వాటిని కూడా క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత పరిహారం పూర్తిగా చెల్లించినట్టు నిర్ధారణకు వచ్చామన్నారు. త్వరలోనే రైతుల నుంచి భూములు స్వాధీనం చేసుకుని పరిశ్రమలకు కేటాయిస్తామని, రైతులు సహకరించాలని కోరారు. దీనిపై పలువురు రైతులు మాట్లాడుతూ భూసేకరణ సమయంలో 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు మాట మార్చి నష్టపరిహారం చెల్లింపుల్లో అన్యాయం చేశారని ఆరోపించారు. నిర్వాసితుల్లో మేజర్లకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.24 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ పరిహారం చెల్లింపునకు 2010వ సంవత్సరాన్ని కటాఫ్ డేట్‌గా ప్రకటించడాన్ని తామంతా వ్యతిరేకిస్తున్నామన్నారు. పరిహారం చెల్లించిన సంవత్సరం లేదా, భూములు స్వాధీనం చేసుకున్న సంవత్సరాన్ని పరిగణనలోకి తీసుకుని ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని రైతులు స్పష్టం చేశారు. నిర్వాసిత గ్రామాల్లో పరిహారం పెండింగ్ లేదనే విషయం తెలియజేయడం కోసమే ఈ గ్రామసభలు నిర్వహించామని, రైతులు సహకరించాలని తహసీల్దార్ నర్సింహమూర్తి కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, డీటీ అన్నాజీరావు, ఏపీఐఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై చర్యలకు డిమాండ్



ఖాజీపాలెంలోని సీసీ రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం ఖాజీపాలెంలో అభివృద్ధి పనులకు ఏర్పాటు చేసిన శిలా ఫలకంలో అధికారులు ప్రొటోకాల్‌కు తిలోదకాలిచ్చారని జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ ఆరోపించారు. గ్రామంలో పల్లె పండగ పేరుతో జరిగిన కార్యక్రమంలో భాగంగా ప్రొటోకాల్ ప్రకారం తన పేరు ముద్రించాల్సి ఉన్నా అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారని కుమార్ మండిపడ్డారు. గతంలో మండల వ్యాప్తంగా జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు ప్రొటోకాల్ పాటించారని, అదే అధికారులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విస్మరించడం సరికాదన్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని కుమార్ తెలిపారు. ప్రొటోకాల్‌తో సంబంధం లేని వ్యక్తుల పేర్లను శిలా ఫలకంపై రాయడం తప్పుడు సంప్రదాయమన్నారు. ఇప్పటికైనా అధికారులు పునరాలోచించి ప్రొటోకాల్ సక్రమంగా అమలు జరిగేలా చూడాలని ఆయన కోరారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన అవసరం

కోటవురట్ల: విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రమేష్ సూచించారు. పాములవాకలోని కిల్లాడ రామ్మూర్తినాయుడు జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు ఈవ్ టీజింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. మొబైల్ ఫోన్లను సాధ్యమైనంత వరకు దూరం పెట్టాలని, చదువుపై దృష్టి కేంద్రీకరించి మంచి ఉద్యోగంతో జీవితంలో స్థిరపడేలా ప్రణాళిక చేసుకోవాలన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా ఉన్నాయని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలను ప్రతిఘటించాలని, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకుండా మంచి నడవడికను కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హెచ్ఎం కె.వి.లక్ష్మీనారాయణ, పీడీ అచ్యుతరావు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభ్యున్నతిపై దృష్టి సారించండి

పాయకరావుపేట: గ్రామాలు అభివృద్ధిపై పాలక వర్గాలు దృష్టి సారించాలని ఎంపీడీవో జయప్రకాష్ రావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజులుగా జరుగుతున్న ఉపసర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలపై ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించేలా అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి(యలమంచిలి): పంచాయతీలలో అభివృద్ధి పనులు ఏవిధంగా జరిపించాలో గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. మొదటి విడతగా గ్రామ ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, రెండో విడత గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారంతో శిక్షణ తరగతులు ముగిశాయి.

సంపద కేంద్రాలు అభివృద్ధి చేయాలి



అటర్లకోట గ్రామంలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్

పాయకరావుపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని అరట్లకోట పంచాయితీ సంపద కేంద్రంను ఆయన శుక్రవారం పరిశీలించారు. సంపద కేంద్రాలు అభివృద్ధిపై సిబ్బంది తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు అందించారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No. 7/2020 O.S. No. 171/2012

Between:
పడమట సుబ్బలక్ష్మి .. DHR
And
ప్రగడ అన్నపూర్ణ .. JDR

పై నెంబరు అమలులో DHR వారికి చెల్లించవలసిన డిక్రీ బాకీ వగైరాలు రాబట్టు నిమిత్తం ఈ JDR యొక్క దిగువ షెడ్యూలు స్థిరాస్తి వేలం నిమిత్తం తే. 01-11-2024న వాయిదా అయి వున్నది. సదరు వాయిదా రోజు ఉదయం సదరు పై కోర్టులో 10:30 గం॥ నుండి సాయంత్రం 5-00 గం॥ల వరకు వేలం కాబడును. సదరు వేలంలో పాల్గొనదలచినవారు పాల్గొని వేలం పాట పాడుకొనవచ్చునని ఇందుమూలంగా యావన్మంది ప్రజలకు తెలియజేయడమైనది.

షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా, యలమంచిలి సబ్ రి॥ యలమంచిలి మండలం, యలమంచిలి టౌన్, 8th Ward, 14th Block, C.P.పేట ఏరియా, పడమట దిక్కున పంచాయితీ రోడ్డులో ఖాళీ స్థలం మరియు RCC స్లాబు ఇల్లు డోర్. నెం. 14-71 గల ఇంటికి హద్దులు.
తూ॥ప॥ 36 అడుగులు (10.97 చ॥మీ॥)
ఉ॥ద॥ 47 అడుగులు (14.325 చ॥మీ॥)
మొత్తం 188 చ॥గ॥లు (152.92 చ॥మీ॥)
హద్దులు: తూర్పు: మైసం శంకరరావు స్థలం, దక్షిణం: కొశారు నానాజీ స్థలం, పడమర: సంతగోడ, ఉత్తరం: నిమ్మకాయల తమ్మిరాజు స్థలం.
డి.హెచ్.ఆర్.విలువ రూ॥ 10,00,000
అప్‌సెట్ విలువ: రూ॥ 15,00,000
మార్కెట్ విలువ: రూ॥ 26,10,000 వేలం తేది: 01-11-2024
యలమంచిలి N.R.S.T. ROY, అడ్వకేట్,
తేది. 15-10-2024 యలమంచిలి, సెల్: 94407 87877
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ ప్రకటన ఇవ్వడం అయినది)